సాక్షి ప్రకాశం

ఆదివారం । 14 । మే । 2023



ఉదయం రెక్కీ.. రాత్రి దోపిడీ

తాళాలు వేసి ఉన్న ఇళ్ల వద్ద పగటి పూట రెక్కీ చేసి.. రాత్రి వేళ ఇద్దరు వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు.

- 8లో..



కోలాహలంగా బండలాగుడు పోటీలు

బల్లికురవ మండలం కొణిదెనలో రాష్ట్రస్థాయి ఎడ్లబండలాగుడు పోటీలు నిర్వహించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
42 /29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో శ్యామల ప్రతిభ



ద్వితీయ స్థానం సాధించిన శ్యామలా దేవి

మార్కాపురం: దక్షిణ కొరియాలో శనివారం నుంచి ప్రారంభమైన ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దోలా శ్యామలా దేవి 80 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ నెల 22 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. పలు విభాగాల్లో శ్యామలా దేవి పాల్గొంటున్నారు. హర్డిల్స్‌లో ద్వితీయ స్థానం సాధించడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌లో 12 వేల కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఒంగోలు టౌన్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లాలోని అన్నీ న్యాయస్థానాల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 12 వేల కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్ పర్సన్ ఏ.భారతి తెలిపారు. ఈ కేసుల్లో మోటారు ప్రమాద బీమా పరిహారం చెల్లింపులు, వివాహ వ్యాజ్యాలతో పాటుగా రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులు ఉన్నాయని చెప్పారు. 11 వేల క్రిమినల్ కేసులు, 110 సివిల్ కేసులు, 22 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.



భవిత ఉజ్వాలం

పేద విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు వరంగా మారాయి. కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం వీటికి శ్రీకారం చుట్టింది. సకల వసతులతో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తుండడంతో విద్యార్థులు సైతం మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వీటిల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు టాప్‌లో నిలిచారు. 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది నుంచే సీబీఎస్‌ఈ సిలబస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

- పేదలకు వరంగా ఆదర్శ పాఠశాలలు
- పదిలో ఉత్తమ ఫలితాలు
- ఈ ఏడాది నుంచే సీబీఎస్‌ఈ అమలు
- 6 మోడల్ స్కూల్స్‌లో 600 సీట్లు
- ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- జూన్ 11న ప్రవేశ పరీక్ష

మార్కాపురం: కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా మంచి వాతావరణంలో, అధునాతన క్లాస్ రూమ్స్, గార్డెనింగ్, మంచి భోజనం, గ్రంథాలయం ఇలా అన్ని హంగులతో కూడిన మోడల్ స్కూళ్లలో చేరేందుకు సమయం ఆసన్నమైంది. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు కార్పొరేట్ విద్యను ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్నారు. పూర్తి స్థాయి క్రమశిక్షణతో పాటు అత్యుత్తమ విలువలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, ఆరో తరగతి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. పాఠ్య పుస్తకాలతోపాటు దుస్తులను కూడా ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. అన్ని రకాలుగా పేద విద్యార్థులకు వరంగా మారిన ఈ మోడల్ స్కూళ్లలో అడ్మిషన్స్‌కు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

అందుబాటులో 600 సీట్లు

జిల్లాలో మార్కాపురం మండలంలోని మిట్టమీదిపల్లి, దోర్నాల మండలంలోని మొట్లమల్లికార్జునపురం, దర్శి, రాచర్ల, ముండ్లమూరు, కనిగిరిలలో మోడల్ స్కూల్స్ ఉన్నాయి.

ప్రస్తుతం జిల్లాలో 6 మోడల్ స్కూల్స్‌లో 600 ఖాళీలు ఉన్నాయి. ఈ ఏడాది సీబీఎస్‌ఈ సిలబస్‌ను కూడా అమలు చేస్తున్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం లోపు పూర్తి చేసిన దరఖాస్తులు పంపాలి.

పదిలో ఉత్తమ ఫలితాలు

మోడల్ స్కూళ్లలో చదివిన విదార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఎక్కువ మంది పాసయ్యారు. మొత్తం 521 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 418 మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో అత్యధిక మంది ప్రథమ శ్రేణి సాధించారు.

దరఖాస్తు ఇలా..

ఈ నెల 9 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. 25వ తేదీ లోపు దరఖాస్తులు పూర్తి చేయాలి. విద్యార్థులు httpr://apmr.ap.gov.in.apmrలో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలి. వచ్చే నెల 11న దరఖాస్తు చేసిన పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుంది.

అర్హతలు:

మోడల్ స్కూల్లో ప్రవేశానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే 2011 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 2009 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 1వ తేదీలోపు జన్మించాలి. 2022–2023 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలి. ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. పరీక్ష ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. జూన్ 16న మెరిట్ జాబితా ప్రకటిస్తారు. మెరిట్ లిస్ట్‌ను బట్టి రోస్టర్ ప్రామాణికంగా సీట్లు కేటాయిస్తారు.

నాణ్యమైన విద్య



ఏపీ మోడల్ స్కూల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నాం. కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా విద్యా బోధన సాగుతోంది. 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్య అందిస్తాం. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించారు. మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఉపాధ్యాయుల సమష్టి కృషితో ఇది సాధ్యమైంది.

– మురళి, ప్రిన్సిపల్ మిట్టమీదిపల్లి



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

పదో తరగతి ఫలితాలిలా..

మోడల్ స్కూల్	పరీక్షకు హాజరైనవారు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణతా శాతం	అత్యధిక మార్కులు
కనిగిరి	96	85	89	ఎ.మణికంఠ (582)
దర్శి	91	76	84	ఎస్.సాగంధిక (581)
ముండ్లమూరు	86	71	83	తూము శివపార్వతి (565)
మిట్టమీదిపల్లి	80	77	97	ధనలక్ష్మి (555)
రాచర్ల	80	52	65	పి.యోగేశ్వర భానుతేజ (558)
మొట్లమల్లికార్జునపురం	88	57	65	ఎస్.వీరగౌరీప్రియ (530)



అనురాగ దేవత అమ్మ

నీ ఆశలకు ఆయువు నింపి..
నీ ఆశయాలకు ఊపిరిలూది..
మమకారపు ముద్దలు కలిపి..
అనురాగపు ఊయలలూపి..
నడకను..నడతను నేర్పి
జీవిత పాఠాలు చెప్పి..
నీ భవితకు బంగరు బాటలేసి..
అవని అంత ఓర్పుతో..
కష్టాల కడలి దాటించి..
ఓటమిలో భుజం తట్టి..
నిన్ను మనిషిగా నిలబెట్టిన..
అనురాగ దేవత అమ్మ..
నేడు మాతృభాషా దినోత్సవం సందర్భంగా అమ్మలందరికీ శుభాకాంక్షలు.

- మరిన్ని చిత్రాలు 8లో

వెలిగండ్ల తహశీల్దారుకు సీఎస్‌పురం బాధ్యతలు

ఒంగోలు అర్బన్: వెలిగండ్ల తహశీల్దారు సీ నాగార్జునరెడ్డికి సీఎస్‌పురం తహశీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్‌పురం తహశీల్దారుగా ఉన్న ఏ బాలకిషోర్ వెబ్‌ల్యాండ్, పట్టాదారు పాసు పుస్తకాల జారీ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో విచారణ చేపట్టిన కలెక్టర్.. తహశీల్దారును సస్పెండ్ చేశారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారుకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్‌కు గడప గడపలో పూలు చల్లి ఆహ్వానం పలికారు. ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందించిన పథకాలను ఆయన వివరిస్తూ వారి ద్వారా సమాధానం అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తుందని, అందుకే తిరిగి మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలను పార్టీల నాయకులకు అందించేవారని, కానీ నేడు పార్టీలకతీతంగా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ అందిస్తోందని వివరించారు. మండల కేంద్రాల్లో కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్థానికంగా అవసరాలు తీర్చేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల ద్వారా ప్రజల అవసరాలు తీరుస్తుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సురేష్ కోరారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ముందుగా సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పనిచేయని వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని సురేష్ ఆదేశించారు. ఈయన వెంట తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ కే తులసిమల్లికార్జున నాయక్, ఏఓ కే నీరజ, ఏపీవో సుజాత, ఎంపీఎం కృపమ్మ, డీఈ సురేష్, ఏఈ లు మంగారావు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ బాలగురవయ్య, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, మండల పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, పార్టీ నాయకులు మల్లికార్జున్, సత్యనారాయణరెడ్డి, కోటయ్య, వెంకటేశ్వర్లు, బాల కోటిరెడ్డి, గురవారెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఖోఖో క్రీడా వేసవి శిక్షణ శిబిరం



పంగులూరులో వామప్ చేస్తున్న క్రీడాకారులు

జే.పంగులూరు: ఈ నెల 7 నుంచి పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ వారి సహకారంతో ఖోఖో వేసవి శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా, బాపట్ల జిల్లా నలుమూలల నుంచి బాలికలు 30 మంది, బాలురు 40 మంది, పురుషులు 30 మంది మొత్తం 100 మందికి శిక్షణ ఇస్తున్నారు. బాలబాలికలకు ప్రతిరోజు ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు, పురుషులకు 5 నుంచి 8.30 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. జూన్ 1వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పీడీ మేకల సీతారామిరెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా చీఫ్ కోచ్ కేపీ పాల్‌కుమార్, ప్రకాశం జిల్లా చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి శిక్షణ ఇస్తున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతులు కల్పించారు.

రోడ్డు సేఫ్టీ విధిగా చేపట్టాలి

- రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.సాయి ప్రద్యుమ్న
- ఆటోమేటిక్ కంప్యూటరైజ్డ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ కోసం రూ.1.15 కోట్ల మంజూరుకు అంగీకారం
- రవాణా శాఖ ప్రాంగణంలో డ్రైవింగ్ ట్రాక్ పరిశీలన



డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న రవాణా, రోడ్లు, బిల్డింగ్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.సాయి ప్రద్యుమ్న, కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు సబర్బన్: రోడ్డు సేఫ్టీని విధిగా చేపట్టాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌పోర్టు, రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.సాయి ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఒంగోలు వచ్చిన ఆయన కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌తో కలిసి రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణాన్ని, అనంతరం హైవేను, తరువాత ఒంగోలు ఆర్టీసీ డిపోను పరిశీలించారు. తొలుత వెంగముక్కపాలెం రోడ్డులోని రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రాంగణంలోని డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న ఇన్‌చార్జ్ డీటీసీ చందర్‌తో పాటు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలిచ్చారు. పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. నాన్ పేమెంట్‌కు సంబంధించిన వాటిలో అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా లైఫ్ ట్యాక్స్, క్వార్టర్ ట్యాక్సులు బాగా వసూలు చేయాలని ఆదేశించారు. రహదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పెంచాలని సూచించారు. ఈ మేరకు ప్రాంగణంలో ఆటోమేటిక్ కంప్యూటరైజ్డ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను (ఏడీటీటీ) నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ ప్రాంగణం మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైను వెళ్తున్నందున ప్రస్తుతం ఉన్న డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ను పక్కకు మార్చి ఆధునీకరించాల్సి ఉందని, అందుకోసం పరిశీలించటానికి వచ్చినట్లు చెప్పారు. ఆధునీకరణ కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.1.15 కోట్ల వ్యయ అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించారని ప్రద్యుమ్న పేర్కొన్నారు. ఆటోమేటిక్ కంప్యూటరైజ్డ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేస్తామన్నారు. అనంతరం ఒంగోలు ఆర్టీసీ డిపోను, బస్టాండ్ ప్రాంగణాన్ని నిశితంగా పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు సంబంధించిన అసౌకర్యాలు ఏమన్నా ఉన్నాయా అని ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ శ్రీమన్నారాయణను అడిగి తెలుసుకున్నారు. గ్యారేజ్‌ను, కార్గో సర్వీసెస్‌ను కూడా పరిశీలించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ వెంట జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ విజయరత్నంతో, మార్కాపురం ఆర్టీవో అమర్ నాయక్, డీటీసీ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (ఏఓ) ఎం.శ్రీనివాస్, డి.సుధాకర్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఏ.కిరణ్ ప్రభాకర్, ఎల్.సురేంద్ర ప్రసాద్, ఎన్.జగదీష్, దర్శి ఇన్‌స్పెక్టర్ పి.రవి కుమార్, ఏఎంవీఐ కే.జయ ప్రకాష్‌తో పాటు మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారు.

రహదారుల భూ సేకరణ వేగవంతం చేయాలి

ఒంగోలు అర్బన్: జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూ సేకరణ పనులు వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న సూచించారు. శనివారం జిల్లాకు చ్చిన ఆయన కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 167వ నంబర్ జాతీయ రహదారి భూ సేకరణ, నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక పరమైన సమస్యలుంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఒంగోలు, దర్శి, మార్కాపురంలలో ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన 5 ఎకరాల భూములను త్వరగా కేటాయించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో గుంటూరు ప్రాంత జేటీసీ కృష్ణవేణి, జిల్లా ఇన్‌చార్జ్ డీటీసీ చందర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ విజయరత్నం, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.

ప్రేమమూర్తికి వందనం






అమ్మని మించి దైవమున్నదా..
ఆత్మను మించి అద్దమున్నదా..
జగమే పలికే శాశ్వత సత్యమిదే..
అందరినీ కనే శక్తి అమ్మ ఒక్కతే..
అవతార పురుషుడైనా ఓ అమ్మకు కొడుకే...
మాతృదేవత గురించి ఓ సినీ
గేయ రచయిత రాసిన అక్షరాలివి.
అక్షర సత్యాలివి. భగవంతుడు
అన్నిచోట్లా ఉండలేక అమ్మను సృష్టించాడనే చెప్పాలి.
అమ్మ చూపించే ప్రేమ అనంతం. ఆమె అనురాగాలు,
ఆప్యాయతల గురించి ఎంత చెప్పినా..
ఏం రాసినా తక్కువే.
నేడు మాతృ దినోత్సవం సందర్భంగా
ప్రేమమూర్తులందరికీ పాదాభివందనం.

మాతృ దినోత్సవం

- సాక్షి, ఒంగోలు



కోలాహలంగా బండలాగుడు పోటీలు



పోటీలో బండ లాగుతున్న ఎడ్లు

- రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న 22 ఎడ్ల జతలు

బల్లికురవ: మండలంలోని కొనిదెన గ్రామ సమీపంలో వేంచేసి ఉన్న రామలింగేశ్వరస్వామి 14 వార్షిక తిరునాళ్ల సందర్భంగా రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు పళ్లు, నాలుగు పళ్లు విభాగాల్లో వేర్వేరుగా ఎడ్ల బండ లాగుడు పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 22 జతలు వచ్చి పోటీల్లో పాల్గొన్నాయి. రెండు పళ్ల విభాగంలో మొదట బహుమతి కొణిదెల గ్రామానికి చెందిన గుంజి రుషిత, రెండో బహుమతి మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన తోట సుబ్బారావు, మూడో బహుమతి పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన తరుణ్‌తేజ ఎడ్లు, నాలుగో బహుమతి పల్నాడు జిల్లా ఇక్కుర్తి గ్రామానికి చెందిన ఎం పోతురాజు ఎడ్లు సాధించాయి.

నాలుగు పళ్ల విభాగంలో..

మొదటి బహుమతి కొణిదెనకు చెందిన గుంజి వినయ్ కుమార్, రెండో బహుమతి కొణిదెనకే చెందిన గుంజి వెంకటేశ్వర్లు, మూడో బహుమతి కాకుమాను మండలం జీపీ చౌదరి, నాలుగో బహుమతి పత్తిపాడు మండలం కల్లూరి రాజేష్ ఎడ్లు సాధించాయి. రెండు పళ్ల విభాగంలో మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో రూ.10 వేలు అందించారు. నాలుగుపళ్ల విభాగంలో మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ. 15 వేలను నిర్వాహకులు అందించారు.

కారుమంచి వ్యక్తి శ్రీశైలంలో ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న శ్రీశైలం సీఐ దివాకర్‌రెడ్డి, పోలీసులు

శ్రీశైలం: శ్రీశైలంలో దేవస్థానం పరిధిలోని ఓ వసతి గృహం గదిలో ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చెందిన డాకా రామసుబ్బారెడ్డి (57) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం శ్రీశైలం చేరుకున్న ఆయన.. ఓ వసతి గృహంలో గది అద్దెకు తీసుకున్నాడు. శనివారం ఉదయం ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బంది తలుపులు కొట్టారు. అయినా తీయకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రామసుబ్బారెడ్డి వ్యాపారం నిమిత్తం మైసూర్‌లో స్థిరపడ్డాడని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు.

ఉదయం రెక్కీ..రాత్రి దోపిడీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు

- సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ సమీపంలో చోరీ
- సుమారు రూ.7.60 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు అపహరణ
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- రెక్కీ చేసి దోపిడీకి పాల్పడుతున్నట్లు నిర్ధారణ



చోరీ జరిగిన ఇంటి ఎదురుగా ఉన్న దుకాణంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

సింగరాయకొండ: తాళాలు వేసిన గృహాలే లక్ష్యంగా దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని పట్టాభివారివీధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మండల కేంద్రంలోని పట్టాభివారివీధిలో కొరియల్ పాయింట్ నిర్వాహకుడు కొలకలపూడి సాంబిరెడ్డి తన భార్యతో కలిసి ఈ నెల 10న బంధువుల వివాహానికి హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటికి చేరుకున్నాడు. ఇంటి గేటు తాళం పగలకొట్టి ఉండటంతో కంగారుగా లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో దుస్తులు, బీరువాలో వస్తువులు, బెడ్‌రూమ్‌లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో సాంబిరెడ్డి వెంటనే విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమాలు సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. అయితే సాంబిరెడ్డి హైదరాబాద్ వెళ్లేటప్పుడు 14 సవర్ల బంగారు వస్తువులు పాత కేసులో ఉంచగా..అవి చోరీకి గురికాలేదు. కానీ బీరువాలో ఉంచిన రూ.4.60 లక్షల నగదు, 4 సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు చోరీ అయ్యాయని, వీటి విలువ రూ.3 లక్షల ఉంటుందని పేర్కొన్నాడు. చోరీ జరిగిన ఇంటికి ఎదురుగా ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇందులో ఒకరు గోడదూకి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడగా.. మరొక దొంగ ఎవరికీ అనుమానం రాకుండా బయట పరిశీలిస్తున్నాడు. దొంగతనం పూర్తయ్యాక ఇద్దరు కలిసి వెళ్లిపోయారు. వీరు ఎక్కడా సీసీ కెమెరాలకు ఆనవాళ్లు చిక్కకుండా జాగ్రత్త పడ్డారు. సీఐ రంగనాథ్ చోరీ విషయాన్ని ఎస్పీ దృష్టి తీసుకెళ్లడంతో ఆమె క్లూస్‌టీం డాగ్ స్క్వాడ్‌లను పంపించారు. రంగంలోకి దిగిన క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రల సేకరణలో నిమగ్నమయ్యారు. తరువాత ట్రైనీ ఐపీఎస్ అధికారి సురాన అంకిత మహావీర్, అడిషనల్ ఎస్పీ ఎస్వీ శ్రీధర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు.

రెక్కీ నిర్వహించిన దొంగలు

దొంగలు రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఈ నెల 10వ తేదీ రాత్రి ఇద్దరు యువకులు రైల్వేస్టేషన్ రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాల వెనుక ఉన్న కరేటివారివీధిలో కొలపర్తి రామారావు ఇంటి గోడదూకి ఇంటి లోపలికి వెళ్లారు. అయితే వారు ఇంటిలో ఉండటాన్ని గమనించి వెంటనే వచ్చేశారు. ఈ దృశ్యాలు ఆ రోడ్డులో నివాసం ఉంటున్న ఇళ్ల యజమానులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. ఈ రెండు ఘటనల్లో పాల్గొంది ఆ ఇద్దరు యువకులేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మద్దిపాడు: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం మద్దిపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పోలుబోయిన అజయ్ (24) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ వీకెండ్ సందర్భంగా మద్దిపాడు వచ్చాడు. స్నేహితులతో మాట్లాడి వస్తానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన అజయ్.. స్థానిక ఆయిల్ మిల్ వద్ద ఉన్న బిల్డింగ్ ఎక్కి సెల్‌ఫోన్ మాట్లాడుతూ పొరపాటున పక్కనే ఉన్న విద్యుత్ వైరుకు తగలడంతో షాక్ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మద్దిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

కంభం: రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి తిరునాళ్ల సందర్భంగా మండలంలోని రావిపాడులో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లు 3465 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచి సత్తా చాటాయి. మండలంలోని యర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటగిరి హేమలత నాయుడు ఎడ్లు 3302 అడుగులు లాగి ద్వితీయస్థానం, పల్నాడు జిల్లా గాజులపాలెం గ్రామానికి చెందిన ఒంగోలు యశ్వంత్ నాయుడు ఎడ్లు 3175 అడుగులు లాగి తృతీయస్థానం, నంద్యాల కు చెందిన యం. భావనరెడ్డి ఎడ్లు, గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన ఎదురు శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3003 అడుగులు లాగి నాల్గవస్థానం, గుంటూరు జిల్లా పెదకాకాణికి చెందిన మందపాటి లింగయ్య చౌదరి ఎడ్లు 2683 అడుగులు లాగి ఐదవస్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేశారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య



సుభాషిణి(ఫైల్)

కొనకనమిట్ల: కుటుంబ సమస్యల నేపథ్యంలో బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని గొట్లగట్టులో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే. గ్రామానికి చెందిన మంత్రి సుభాషిణి(15) కుటుంబంలో నెలకొన్న సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కొనకనమిట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యువతి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.